

క్యాంపస్ కళాశాలలో కొత్త కోర్సు

జేఎన్‌టీయూ క్యాంపస్ కళాశాలలో కొత్తగా కంప్యూటర్ సైన్సెస్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సు అందుబాటులోకొచ్చింది. 8లో



చక్రబంధంలో జేఎన్‌టీయూ

ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో అనంతపురంలోని జేఎన్‌టీయూ వద్ద భారీ భద్రతా చర్యలు తీసుకున్నారు. 8లో



జిల్లా అంతటా ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలి వేగం పెరిగింది. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

టీబీ డ్యాంకు మొదలైన వరద



తుంగభద్ర జలాశయం

బొమ్మనహాళ్: జిల్లా వరదాయిని అయిన తుంగభద్ర జలాశయం (టీబీ డ్యాం)కు వరద నీటి చేరిక మొదలైంది. కర్ణాటకలోని హొస్పేట వద్ద ఉన్న ఈ డ్యాంకు ప్రస్తుతం 411 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ఎగువ భాగంలో కురిసిన వర్షాలతో ఆదివారం డ్యామ్‌లోకి ఇన్‌ఫ్లో మొదలైంది. సకాలంలో డ్యామ్ నిండితే జులై మొదటి లేదా రెండో వారంలో తుంగభద్ర ఎగువ కాలువ(హెచ్చెల్సీ)కు నీటిని వదిలే అవకాశం ఉంటుంది. డ్యామ్ పూర్తిస్థాయి నీటిమట్టం 1,633 అడుగులకు గాను ఆదివారం 1,577.47 అడుగులు, నీటి నిల్వ సామర్థ్యం 105.788 టీఎంసీలకు గాను ప్రస్తుతానికి 3.366 టీఎంసీల నీరు నిల్వ ఉంది. అవుట్‌ఫ్లో 25 క్యూసెక్కులు ఉంది. గత ఏడాది ఇదే సమయానికి 1580.70 అడుగుల వద్ద 4.820 టీఎంసీల నీరు నిల్వ ఉండేది.

నవవిధ భక్తి మార్గాలతో ముక్తి



సంగీత కచేరీ నిర్వహిస్తున్న భక్తులు

ప్రశాంతి నిలయం: మానవుడు నవవిధ భక్తి మార్గాల ద్వారా ముక్తిని పొందవచ్చన్న సందేశాన్నిస్తూ బాలవికాస్ చిన్నారులు చక్కటి నృత్యరూపకం ప్రదర్శించారు. పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన తమిళనాడు భక్తులు ఆదివారం సత్యసాయి సన్నిధిలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సాయి ధ్వని పేరుతో నిర్వహించిన సంగీత కచేరీ భక్తులను పరవశింపజేసింది. సాయంత్రం తమిళనాడు బాలవికాస్ చిన్నారులు పురాణ ఇతిహాసాలను ఇతివృత్తంగా చేసుకుని నవవిధ భక్తి పేరుతో నృత్యరూపకం ప్రదర్శించారు. భక్తులు అనుసరించిన విభిన్న మార్గాలను, నిత్య జీవితంలో భగవంతున్ని ప్రసన్నం చేసుకోవడానికి ఆచరించాల్సిన మార్గాలను చక్కగా వివరించారు.

జిల్లాకు చేరుకున్న పరిశీలకులు



అనంతపురం అర్బన్: కౌంటింగ్ పరిశీలనకు ఎన్నికల సంఘం ప్రత్యేకంగా నియమించిన పరిశీలకులు మనీష్ సింగ్, అజయ్‌నాథ్ ఝ, అజయ్‌కుమార్‌లు ఆదివారం అనంతపురం చేరుకున్నారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో విడిది చేసిన వారిని కలెక్టర్ వినోద్‌కుమార్‌తో పాటు ఎస్పీ గౌతమి శాలి, జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి, అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న కలిశారు. కౌంటింగ్ నిర్వహణకు చేపట్టిన ఏర్పాట్లు, బందోబస్తు గురించి వారికి కలెక్టర్, ఎస్పీ వివరించారు.

ఫస్ట్ ఉరవకొండ.. లాస్ట్ రాయదుర్గం!

కౌంటింగ్ ఫలితాలు వెల్లడి కానున్నాయిలా..

- పకడ్బందీ ఏర్పాట్లు చేసిన యంత్రాంగం
- తుది ఫలితాలు రాత్రికి వెల్లడయ్యే అవకాశం



జేఎన్‌టీయూలో ఓట్ల లెక్కింపునకు చేసిన ఏర్పాట్లు

అనంతపురం అర్బన్: ఎన్నికల సమరంలో తుది ఘట్టమైన ఓట్ల లెక్కింపు ఈ నెల 4న జరగనుంది. ప్రక్రియ పకడ్బందీగా జరిగేలా జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. ఓట్ల లెక్కింపు క్రమంలో మొదటగా ఉరవకొండ అసెంబ్లీ ఫలితాలు వెల్లడి కానున్నాయి. చివరిగా రాయదుర్గం ఫలితాలు వెలువడతాయి. తుది ఫలితాలు వెల్లడయ్యే సరికి మంగళవారం రాత్రి అయ్యే అవకాశం ఉంది.

ఓట్ల లెక్కింపునకు 954 మంది..

రాష్ట్ర వ్యాప్తంగా మే 13న పోలింగ్ జరిగింది. జిల్లాలో మొత్తం 20,18,162 ఓట్లు ఉండగా 16,36,648 (81.10 శాతం) ఓట్లు పోలయ్యాయి. పురుషులు 8,17,536 మంది, మహిళలు 8,19,004 మంది, ఇతరులు 108 మంది తమ ఓటు వేశారు. అంతకు కొన్ని రోజుల ముందు పోస్టల్ బ్యాలెట్లను అధికారులు, ఎన్నికల సిబ్బంది వినియోగించుకున్నారు. ఈ క్రమంలో మంగళవారం జరగనున్న కౌంటింగ్‌లో ఈవీఎం ఓట్లు, సర్వీసు ఓట్ల లెక్కింపునకు 954 మంది సిబ్బందిని నియమించారు. ఇతర విధులకు 400 మంది సేవలను వినియోగించుకోనున్నారు. పార్లమెంట్ నియోజకవర్గం ఓట్ల లెక్కింపునకు 112 టేబుళ్లు, అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపునకు 116 టేబుళ్లు ఏర్పాటు చేశారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల పోస్టల్ బ్యాలెట్ ఓట్లు, సర్వీసు (ఈటీపీబీ) ఓట్ల లెక్కింపునకు 54 టేబుళ్లు ఏర్పాటు చేయగా,నియోజకవర్గాలకు సంబంధించి ఈవీఎంల గణనకు 14 చొప్పున కౌంటింగ్ టేబుళ్లు, ఉరవకొండకు 18 టేబుళ్లు ఏర్పాటు చేశారు.

పోస్టల్ బ్యాలెట్ల ఫలితాలు చివర్లో వెల్లడి..

పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుంది. ఐదారు గంటల్లో అన్ని నియోజకవర్గాల పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు పూర్తవుతుంది. అయినప్పటికీ వీటి ఫలితాలను వెల్లడించరు. ఈవీఎం ఓట్ల లెక్కింపు పూర్తయిన తరువాత చివరలో ప్రకటిస్తారు.

వీవీ ప్యాట్ల లెక్కింపు తరువాతే తుది ఫలితాలు..

పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఓట్ల లెక్కింపు ఫలితాలు వెల్లడించేందుకు ఆలస్యం అవుతుంది. అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి అన్ని రౌండ్ల ఓట్ల లెక్కింపు పూర్తయిన తరువాత ఒక్కో నియోజకవర్గానికి సంబంధించి లాటరీ పద్ధతిలో ఎంపిక చేసిన ఐదు ఈవీఎంల వీవీప్యాట్ ఓట్లను లెక్కిస్తారు. ఇందుకు ఐదారు గంటల సమయం పడుతుంది. దీంతో అధికారికంగా తుదిఫలితాలు కౌంటింగ్ రోజు రాత్రికి వెల్లడి కానున్నాయి.

బరిలో 134 మంది అభ్యర్థులు

అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గం స్థానానికి, 8 అసెంబ్లీ నియోజకవర్గ స్థానాలకు 134 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి 21 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి రాయదుర్గం నియోజకవర్గానికి 13 మంది, ఉరవకొండకు 11 మంది, గుంతకల్లు- 14 మంది, తాడిపత్రి-18 మంది, శింగనమల-14 మంది, అనంతపురం అర్బన్-15 మంది, కళ్యాణదుర్గం-15 మంది, రాప్తాడు -13 మంది మొత్తం 113 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు.

జిల్లాలో మొత్తం ఓట్లు, పోలైన ఓట్లు..

మొత్తం ఓట్లు	20,18,162
పోలైన ఓట్లు	16,36,648
పురుషులు	8,17,536
మహిళలు	8,19,004
ఇతరులు	108

నియోజకవర్గాల వారీగా ఓట్ల లెక్కింపు రౌండ్లు ఇలా...

నియోజకవర్గం	పోలింగ్ బూత్‌లు	మొత్తం ఓట్లు	టేబుళ్లు	రౌండ్లు
రాయదుర్గం	296	2,27,189	14	22
ఉరవకొండ	263	1,92,441	18	15
గుంతకల్లు	276	2,03,820	14	20
తాడిపత్రి	274	2,06.701	14	20
శింగనమల	293	2,05,642	14	21
అనంతపురం	292	1,83,019	14	21
కళ్యాణదుర్గం	261	2,04,297	14	19
రాప్తాడు	281	2,13,207	14	21

పార్లమెంట్ పోస్టల్ బ్యాలెట్ ఓట్లు

పార్లమెంట్	పోలైన పోస్టల్ బ్యాలెట్లు	టేబుళ్లు	రౌండ్లు
అనంతపురం	22,456	20	3

అసెంబ్లీ నియోజకవర్గాల పోస్టల్ బ్యాలెట్ ఓట్లు

నియోజకవర్గం	పోలైన పోస్టల్ బ్యాలెట్లు	టేబుళ్లు	రౌండ్లు
రాయదుర్గం	1,671	4	1
ఉరవకొండ	2,544	4	2
గుంతకల్లు	3,612	4	2
తాడిపత్రి	2,702	6	1
శింగనమల	2,450	4	2
అనంతపురం	6,971	4	4
కళ్యాణదుర్గం	2,614	4	2
రాప్తాడు	4,338	4	3

రేపు అనంతలోకి బయటి వ్యక్తులకు నో ఎంట్రీ

అనంతపురం అర్బన్: ఓట్ల లెక్కింపు సందర్భంగా ఈనెల 4వ తేదీన నగరంలోకి బయటి వ్యక్తులు ఎవరూ ప్రవేశించడానికి అనుమతి లేదని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వి.వినోద్‌కుమార్ స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన ఆదివారం తెలియజేశారు. కౌంటింగ్ ఏజెంట్లు నగరంలోని లాడ్జీలు, హోటళ్లు, కమ్యూనిటీ హాళ్లు, షాదీ ఖానాలు, కల్యాణ మండపాల్లో బస చేసేందుకు సోమవారం రాత్రికి రావాలని సూచించారు. ఇతర జిల్లాలకు చెందిన కుటుంబాలు, వారి కుటుంబ సభ్యులు, మతపరమైన వాళ్లను మాత్రమే నగరంలోకి అనుమతిస్తారన్నారు. నిబంధనలు ఉల్లంఘించి ఉండే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నగరంలోని లాడ్జీలు, హోటళ్లు, కమ్యూనిటీ హాళ్లు, షాదీ ఖానాలు, కల్యాణ మండపాల్లో బస చేసేందుకు వచ్చే వారి గుర్తింపు కార్డులు, పూర్తి వివరాలను యాజమాన్యం తీసుకోవాలన్నారు. ఏజెంట్లు కాకుండా బయటి వ్యక్తులు ఎవరినీ అనుమతించకూడదన్నారు. లాడ్జీలు, హోటళ్లు, కమ్యూనిటీ హాళ్లు, షాదీ ఖానాలు, కల్యాణ మండపాలను పరిశీలించే బాధ్యతలను వీఆర్‌ఓలకు అప్పగించామన్నారు. ఇతరులను ఇళ్లలో ఉంచుకోకూడదని తెలియజేస్తూ జేఎన్‌టీయూ పరిసరాల్లోని నివాసితులకు నోటీసు ఇచ్చామన్నారు. ఏ విషయంలోనూ పోలీసులకు తప్పుడు సమాచారం ఇవ్వకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు.

పాలిసెట్ సర్టిఫికెట్ల పరిశీలన వాయిదా

అనంతపురం: ఏపీ పాలిసెట్-2024లో భాగంగా సోమవారం నిర్వహించాల్సిన సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు ప్రిన్సిపాల్ సి. జయచంద్రా రెడ్డి తెలిపారు. 3న జరగాల్సిన సర్టిఫికెట్ల పరిశీలనను 6న నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఈ మేరకు షెడ్యూల్ మార్పు చేశామన్నారు. అదే విధంగా వెబ్‌ఆప్షన్లు ఈ నెల 7 నుంచి ఇచ్చుకోవచ్చునని పేర్కొన్నారు.

కౌంటింగ్ ఏర్పాట్లు పూర్తి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ వినోద్‌కుమార్, చిత్రంలో జేసీ కేతన్‌గార్గ్, తదితరులు

అనంతపురం అర్బన్: ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా సాగేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనాకు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వి.వినోద్‌కుమార్ తెలిపారు. కౌంటింగ్‌కు సంబంధించి సీఈఓ ఆదివారం వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయం నుంచి జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్ ఉంచి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి, నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్, అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డీఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపునకు సన్నద్ధంగా ఉన్నామని చెప్పారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు, పూర్తి స్థాయిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. ఫలితాలు త్వరితగతిన ప్రకటించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. కేంద్రాల్లో ప్రవర్తన నియమావళి ప్రకారం వ్యవహరించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు, అభ్యర్థులకు తెలియజేశామన్నారు. జిల్లావ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.

ఫలితాల ప్రకటనలో ముందుండాలి

'ఓట్ల లెక్కింపు కేంద్రాలు పూర్తిగా మీ ఆధీనంలో ఉండాలి. రౌండ్ల వారీగా ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటనలో రాష్ట్రంలో జిల్లా ముందుండాలి. కౌంటింగ్ పూర్తయ్యే వరకు ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాలి. అనుచితంగా ప్రవర్తించే, గట్టిగా అరిచి గోల చేసే ఏజెంట్లను బయటికి పంపించాలి' అని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వి.వినోద్‌కుమార్ అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లోని ఎన్‌ఐసీ హాలులో రిటర్నింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటనలో రాష్ట్ర యావరేజ్ కన్నా ముందుండాలన్నారు. కౌంటింగ్ తరువాత చేయాల్సిన ప్రక్రియలకు సంబంధించి ఏర్పాట్లు, పనులు ముందుగానే పూర్తి చేసుకోవాలని చెప్పారు. కౌంటింగ్ ఏజెంట్లకు పెన్ను, పేపర్ అందించాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో భద్రతకు సంబంధించి పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకున్నారో పరిశీలించాలని ఆదేశించారు. మండలాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాల్లో పరిస్థితి ఎలా ఉందనే సమాచారం గంటకోసారి జిల్లా కేంద్రానికి అందించాలన్నారు. కౌంటింగ్‌కు సంబంధించి ఏదేని సమస్య వస్తే తక్షణం పరిష్కరించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి, నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్, అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డీఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి ఉన్నారు.

నేటి సాయంత్రం నుంచి మద్యం బంద్



అనంతపురం: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ మద్యం దుకాణాలు, బార్లు, కల్లు దుకాణాలు, ఎక్సైజ్ లైసెన్స్ కలిగిన ఇతర అన్ని విభాగాలను సోమవారం సాయంత్రం ఐదు గంటల నుంచి మంగళవారం రాత్రి 11.59 గంటల వరకు మూసేస్తున్నట్లు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి జి. మధుసూదన్ ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే తాడిపత్రి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో బుధవారం అర్ధరాత్రి వరకు మూసేయాలని ఆదేశించామని పేర్కొన్నారు. ఆ సమయంలో మద్యం, ఇతర మత్తు పదార్థాలు అమ్మినా, సరఫరా చేసినా, కలిగి ఉన్నా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వీటి గురించి సమాచారం ఉంటే ఎక్సైజ్ అధికారి కంట్రోల్ రూం ఫోన్ నంబరు 08554-275515 లేదా జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి ఫోన్ నంబర్ 7981216391కు సమాచారం ఇవ్వాలని కోరారు.

నైరుతి వచ్చె.. వర్షాలు తెచ్చె



విడపనకల్లు మండలం పాల్తూరు-దర్గాహొన్నూరు మార్గంలో వాన నీటితో ఉధృతంగా పారుతున్న పెద్ద వంక

అనంతపురం అగ్రికల్చర్/బుక్కరాయసముద్రం: జిల్లాలోకి నైరుతి రుతుపవనాలు వచ్చేశాయి. ఆదివారం సాయంత్రం ఉమ్మడి అనంతపురం జిల్లాలోకి ప్రవేశించినట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సహదేవరెడ్డి, వాతావరణ విభాగం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి తెలిపారు. గత 20 ఏళ్లలో జూన్ 2న నైరుతి ప్రవేశించడం ఇది రెండో సారి మాత్రమే అని చెబుతున్నారు. ఈ సారి సాధారణం కన్నా కాస్త అధికంగా వర్షాలు నమోదవుతాయని భారత వాతావరణశాఖ ఇటీవల తీపి కబురు అందించిన విషయం తెలిసిందే.

వర్షాలపై గంపెడాశలు..

జిల్లావ్యాప్తంగా దాదాపు 3.50 లక్షల హెక్టార్లలో సాగులోకి వచ్చే ఖరీఫ్ పంటలకు నైరుతి రుతుపవనాల ప్రభావంతో కురిసే వర్షాలే కీలకం. జిల్లా వార్షిక సాధారణ వర్షపాతం 512.4 మి.మీ కాగా, ఖరీఫ్ నాలుగు నెలల కాలంలో 319.7 మి.మీ నమోదు కావాలి. జూన్‌లో 61 మి.మీ, జూలైలో 63.9 మి.మీ, ఆగస్టులో 83.8 మి.మీ, సెప్టెంబర్‌లో 110.9 మి.మీ సాధారణ వర్షపాతంగా నిర్ధారించారు. అక్టోబర్- డిసెంబర్ వరకు రబీలో ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో వర్షాలు కురుస్తాయి. నైరుతి, ఈశాన్యం మంచి ప్రభావం చూపడంతో 2019 నుంచి 2022 వరకు కరువు తీరేలా వర్షాలు కురిశాయి. 2023 ఖరీఫ్‌లో మాత్రమే వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సారి నైరుతి ప్రభావంతో సాధారణం కన్నా అధికంగానే వర్షపాతం నమోదు కావచ్చని ఇప్పటికే వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో రైతులు ఖరీఫ్‌పై ఆశలు పెట్టుకున్నారు.

20 మండలాల్లో వర్షం

నైరుతి రుతుపవనాల ప్రభావంతో జిల్లాలోని 20 మండలాల్లో వర్షం కురిసింది. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు 20 నుంచి 30 కిలోమీటర్ల వేగంతో వీచిన ఈదురు గాలులతో 14.3 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. ఉరవకొండ మండలంలో 52.6 మి.మీ, కూడేరు 50.4 మి.మీ, బెళుగుప్ప 49.8 మి.మీ, రాయదుర్గం 35.6 మి.మీ, వజ్రకరూరు 32.2 మి.మీ, బొమ్మనహాళ్ 27.2, గుమ్మఘట్ట 25.8, కళ్యాణదుర్గం 24.2 మి.మీ, కంబదూరు 24.2, ఆత్మకూరు 20 మి.మీ వర్షపాతం నమోదైంది. అలాగే బ్రహ్మసముద్రం, విడపనకల్లు, యాడికి, యల్లనూరు, గుంతకల్లు, గుత్తి, అనంతపురం, శెట్టూరు మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. రాగల మూడు రోజులు జిల్లాకు వర్ష సూచన ఉన్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు.

గృహ హింస బాధితులకు అండ

- దారి చూపుతున్న 'డీవీసీ'
- పలు రూపాల్లో చేయూత
- ఇప్పటివరకూ ఎంతో మంది మహిళలకు సాంత్వన

☛ కదిరి ప్రాంతానికి చెందిన రేష్మా (పేరు మార్చాం)కు 20 ఏళ్ల కిందట పెళ్లయింది. పిల్లలు లేరని భర్త వదిలేశాడు. దీంతో ఆమె ఇటీవల జిల్లా కేంద్రంలోని గృహహింస నిరోధక విభాగం (డీవీసీ) అధికారులను ఆశ్రయించారు. తనకు రక్షణ, భరణం ఇప్పించాలని విజ్ఞప్తి చేయడంతో కేసును కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. సమగ్ర విచారణ చేసిన న్యాయస్థానం బాధితురాలికి నష్ట పరిహారం అందించాలని భర్తను ఆదేశించింది. దీంతో ఆయన బాధితురాలికి రావాల్సిన మొత్తాన్ని అరియర్స్‌తో సహా చెల్లించాడు.

☛ గుంతకల్లు ప్రాంతానికి చెందిన వరలక్ష్మీ (పేరు మార్చాం)కి పెళ్లై 15 ఏళ్లయింది. 13 ఏళ్ల కుమార్తె ఉంది. మనస్పర్థలతో భర్త వదిలేశాడు. ఈ క్రమంలో బాధితురాలు డీవీసీని ఆశ్రయించగా.. అధికారులు భార్యాభర్తలను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. కుటుంబానికి దూరంగా ఉండడం వల్ల ఎదురయ్యే సమస్యలను వివరించారు. దీని ప్రభావం ఎదిగొస్తున్న కుమార్తెపై పడుతుందని హెచ్చరించారు. దీంతో కుటుంబంతో కలసి ఉండేందుకు అతను రాజీకొచ్చాడు.



ఐసీడీఎస్ కార్యాలయంలోని డీవీసీ విభాగం

సాక్షి ప్రతినిధి, అనంతపురం: గృహ హింస బాధితులకు గృహ హింస నిరోధక చట్టం రక్షణగా నిలుస్తోంది. చట్టం అమలుకు జిల్లా స్థాయిలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ (పీడీ) సారథ్యంలో ఐదుగురు సభ్యులతో కూడిన డీవీసీ (డొమెస్టిక్ వయొలెన్స్ కమిటీ) ఏర్పాటైంది. జిల్లాకేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో సభ్యులు అందుబాటులో ఉంటారు. కమిటీకి కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. చట్టం అమలులోకి వచ్చినప్పటి నుంచి ఈ ఏడాది ఏప్రిల్ వరకు 1,730 ఫిర్యాదులు అందగా, 680 కేసులను పరిష్కరించారంటే బాధితులకు డీవీసీ సభ్యులు ఎంతగా సాంత్వన చేకూర్చారో అర్థం చేసుకోవచ్చు.

బాధితురాలి తరఫున ఎవరైనా ఫిర్యాదు..

గృహ హింసకు గురైన బాధితురాలు గానీ ఆమె తరఫున ఎవరైనా ఫిర్యాదు చేయవచ్చు. ముందుగా అధికారులు ఇద్దరి మధ్య రాజీ కుదిర్చేందుకు ప్రయత్నిస్తారు. ప్రతివాది రాజీకి రాని పక్షంలో కేసును కోర్టులో ఫైల్ చేస్తారు. ఈ క్రమంలో మూడు రోజుల్లోనే ఇరుపక్షాల వాదనలను న్యాయమూర్తి వింటారు. 60 రోజుల్లో తీర్పు వెల్లడిస్తారు. బాధితురాలు కోరితే భర్త, అత్తమామలతో కలిసి ఉండేలా చర్యలు తీసుకుంటారు. ఇందుకు వారు ఒప్పుకోకపోతే బాధితురాలు, ఆమె పిల్లలకు భరణం కింద ఖర్చులు భరించాలని ఆదేశిస్తారు. తల్లి నుంచి పిల్లలను బలవంతంగా లాక్కొని హింసిస్తే బాధ్యులను కస్టడీలోకి తీసుకోవాలని పోలీసులకు సూచిస్తారు. కోర్టు ఉత్తర్వులను ప్రతివాది ధిక్కరిస్తే క్రిమినల్ కేసు నమోదు చేసి, రెండేళ్ల శిక్ష లేదా రూ.20 వేల జరిమానా లేకపోతే రెండూ కలిపి విధించే అవకాశం ఉంది.

పట్టింపులకు పోవొద్దు..



వైవాహిక జీవితంపై అమ్మాయిలు, అబ్బాయిలు ఎన్నో కలలు కంటారు. అయితే వాటిని సాకారం చేసుకోవాలంటే ముందుగా అవగాహన చేసుకోవాల్సి ఉంటుంది. చిన్న చిన్న విషయాలకే పంతాలు, పట్టింపులకు వెళ్తూ పచ్చని కాపురాలను కూల్చుకుంటున్నారు. అన్నీ మరచిపోయి పరస్పరం కలసి జీవిస్తే అంతకంటే ఆనందం ఏముంటుంది?

– డాక్టర్ బీఎస్ శ్రీదేవి, ఐసీడీఎస్ పీడీ, అనంతపురం

సర్దుకుపోతేనే సంతృప్తి



ఏ బంధమైనా సర్దుకుపోతేనే బలపడుతుంది. మా దృష్టికి వచ్చే కేసుల్లో అధిక శాతం వైవాహిక బంధంపై సరైన అవగాహన లేని కేసులే ఉంటున్నాయి. నా మాటే నెగ్గాలి, నాదే పైచేయి కావాలనుకుంటున్నందునే కాపురాలు కూలిపోతున్నాయి. ఈ ధోరణి మంచిది కాదు. అమ్మాయిల ఆలోచనా విధానంలోనూ మార్పు వచ్చింది. వాటిని అర్థం చేసుకొని మసలుకుంటే జీవితం మకరందమే అవుతుంది.

– ఉమాదేవి, సోషల్ కౌన్సిలర్, డీవీసీ విభాగం

ఆనందంగా సాగిపోవాలి



జీవితం చాలా చిన్నది. ఎవరు ఎన్నాళ్లు బతుకుతారో తెలియదు. ఉన్నన్నాళ్లూ కుటుంబ సభ్యులతో హాయిగా, ఆనందంగా గడిపేందుకు ప్రయత్నించాలి. చిన్న విషయాలను భూతద్దంలో చూస్తూ మనస్పర్థలు పెంచుకుంటే కొంప కొల్లేరే అవుతుంది. వాటి ప్రభావం పిల్లలపై పడుతుంది. చివరకు కేసులు, పోలీస్ స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరగడానికే సరిపోతుంది.

– నర్మద, లీగల్ కౌన్సిలర్, డీవీసీ విభాగం

క్లుప్తంగా

సంతల ఆదాయం రూ.4.63 లక్షలు



మార్కెట్‌యార్డులో జీవాల సంత

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు ప్రాంగణంలో ఈ వారం జరిగిన జీవాలు, పశువుల సంతల ద్వారా రికార్డు స్థాయిలో రూ.4.63 లక్షలకు పైగా ఆదాయం సమకూరింది. ఈ మేరకు మార్కెట్ యార్డు సెలెక్షన్ గ్రేడ్ సెక్రటరీ ఆర్.జయలక్ష్మి ఆదివారం వెల్లడించారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత నుంచి రూ.2,06,720 వసూలు కాగా ఆదివారం జరిగిన పశువులు, గేదెలు, ఎద్దుల సంత నుంచి రూ.2,56,630 మేర వసూలైందన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



పాలయ్య (ఫైల్)

గుమ్మఘట్ట: ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై ఓ రైతు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుమ్మఘట్ట మండలం గలగలపైదొడ్డి గ్రామానికి చెందిన పాలయ్య (48)కు భార్య మాంతక్క, ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. వ్యవసాయంతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో తాను సాగు చేసిన టమాట పంటకు నీరు పెట్టేందుకు ఆదివారం ఉదయం వెళ్లిన ఆయన మోటార్ స్విచ్ ఆన్ చేసే క్రమంలో స్టార్టర్ పెట్టెను తాకాడు. అప్పటికే షార్ట్ సర్క్యూట్ కారణంగా స్టార్టర్ పెట్టెకు విద్యుత్ ప్రసారమవుతున్న విషయాన్ని పాలయ్య గుర్తించలేకపోయాడు. దీంతో కరెంట్ షాక్‌కు గురై కుప్పకూలాడు. గమనించిన తోటి రైతులు వెంటనే రాయదుర్గంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

కుక్కల దాడిలో 24 గొర్రెల మృతి



ఎన్పీకుంట: మండలంలోని ఎస్.కె.తండాలో వీధి కుక్కలు స్వైరవిహారం చేయడంతో ఇస్లావత్ రవినాయక్‌కు చెందిన సుమారు 24 గొర్రెలు మృత్యువాతపడ్డాయి. బాధితుడు తెలిపిన మేరకు... శనివారం సాయంత్రం ఇంటి వద్ద దొడ్డిలోకి గొర్రెల మందను వదిలి నిద్రపోయారు. ఆదివారం తెల్లవారుజామున దాదాపు 25 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. సమాచారం అందుకున్న పశువైద్యాధికారి డాక్టర్ బాలానాయక్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. కుక్కల దాడిలో గొర్రెలు మృతి చెందినట్లు నిర్ధారించారు. అప్పు చేసి 100 గొర్రెల పోషణ చేపడితే 24 జీవాలను కుక్కల పొట్టన పెట్టుకున్నాయని, దీంతో రూ.2.50 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత కాపరి వాపోయాడు.

చక్రబంధంలో జేఎన్‌టీయూ

కౌంటింగ్ నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రత

- 5 ప్లటూన్ల సీఆర్‌పీఎఫ్ బలగాల మోహరింపు
- 2 వేల మంది పోలీసుల పహారా
- డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా

అనంతపురం: ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో అనంతపురంలోని జేఎన్‌టీయూఏ వద్ద భారీ భద్రతా చర్యలను తీసుకున్నారు. జేఎన్‌టీయూఏకు చేరుకునే అన్ని మార్గాల్లోనూ ముళ్ల కంచెలు ఏర్పాటు చేశారు. మూడంచెల భద్రత నడుమ ఇప్పటికే జేఎన్‌టీయూఏలో ఈవీఎంలు భద్రపరిచిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మంగళవారం కౌంటింగ్ జరగనుంది. ఈ తరుణంలో మునుపెన్నడూ లేని రీతిలో కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. వర్సిటీ పరిసర ప్రాంతాలన్నీ పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు.

అంతా ఖాకీమయం..

కౌంటింగ్ కేంద్రమైన జేఎన్‌టీయూఏ నుంచి కలెక్టరేట్ వరకు, జేఎన్‌టీయూఏ పరిసరాలు మొత్తం ఖాకీమయం అయ్యాయి. అడుగడుగునా పోలీసుల బూట్ల చప్పుడు వినిపిస్తోంది. ఒక్క కౌంటింగ్ కేంద్రంలోనే రెండు వేల మంది పోలీసులు విధులు నిర్వర్తించనున్నారు. దీంతో పాటు జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ తప్పనిసరి చేశారు. దీనికి తోడు 30 పోలీస్ యాక్ట్‌ను యథావిధిగా కొనసాగిస్తున్నారు. ముందస్తు అనుమతి లేకుండా ర్యాలీలు, సభలు నిర్వహించకుండా పటిష్ట చర్యలు తీసుకున్నారు. బాణాసంచా వినియోగంపై నిషేధం విధించారు.



జేఎన్‌టీయూఏ ఎదురుగా చిన్మయనగర్‌కు వెళ్లే మార్గంలో వేసిన ముళ్లకంచె

జేఎన్‌టీయూఏ పరిసర ప్రాంతాలను ‘నో ఫ్లై’ జోన్‌గా ప్రకటించి, బయట వ్యక్తులు డ్రోన్‌లు వినియోగించకుండా పటిష్ట చర్యలు తీసుకున్నారు. మరో వైపు పోలీసుల డ్రోన్ సాయంతో జేఎన్‌టీయూఏ పరిసర ప్రాంతాలను నిశితంగా పరిశీలిస్తున్నారు.

జిల్లా అంతటా నూతన సీసీ కెమెరాల ఏర్పాటు

సమస్యాత్మక గ్రామాలు, కాలనీలపై ప్రత్యేక దృష్టి సారించిన పోలీసు యంత్రాంగం ఆయా ప్రాంతాల్లో నూతనంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసింది. ఇప్పటికే ఉన్న 450 సీసీ కెమెరాలకు తోడు ఆదివారం మరో 280 కెమెరాలను అమర్చారు. వీటిని వైఫై ద్వారా జిల్లా కేంద్రంలోని ఈ-సర్వైలెన్స్‌కు అనుసంధానం చేశారు. సమస్యాత్మక గ్రామాలు, కాలనీలపై జిల్లా కేంద్రం నుంచే నిఘా ఉంచేలా అన్ని చర్యలూ తీసుకున్నారు.

జేఎన్‌టీయూఏ పరిసరాల్లో ట్రాఫిక్ మళ్లింపు..

కౌంటింగ్ నేపథ్యంలో 3, 4 తేదీల్లో జేఎన్‌టీయూఏ పరిసరాల్లో ట్రాఫిక్ మళ్లించారు. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ప్రయాణించాలని ఇప్పటికే అక్కడ నివాసముంటున్న వారికి సూచనలు జారీ చేశారు.

- సర్ థామస్ మన్రో విగ్రహం నుంచి జేఎన్‌టీయూఏ రోడ్డుకు ఎడమ వైపు ఉన్న ఫెర్రర్ నగర్ 9వ క్రాస్‌లో నివాసముంటున్న వారు, శారదానగర్ 6వ క్రాస్, ఎల్ఐసీ కాలనీ 4వ క్రాస్, కె.మల్లప్ప రెండు క్రాస్‌లు, విద్యానగర్ రెండు క్రాస్‌లు, సుశీల్‌రెడ్డి కాలనీ వాసులు అనంతపురం-కదిరి రోడ్డు మీదుగా రాకపోకలు సాగించాలి.
- థామస్ మన్రో సర్కిల్ నుంచి హిందూ శ్మశాన వాటిక దాటిన తర్వాత జేఎన్‌టీయూఏ వరకు రోడ్డుకు కుడి వైపున ఉన్న ఎస్‌బీఐ కాలనీలోని మూడు క్రాస్‌ల వారు హౌసింగ్ బోర్డు నుంచి రాకపోకలు సాగించాలి.
- హౌసింగ్ బోర్డు 80 ఫీట్ రోడ్డు, పరిసర ప్రాంతాల్లో నివాసముంటున్న వారు అశోక్‌నగర్, విద్యుత్ నగర్ మీదుగా రాకపోకలు కొనసాగించాలి.



సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన ముళ్లకంచె

- రాప్తాడు, ప్రసన్నాయపల్లి, ఇందిరమ్మ కాలనీ, చిన్మయనగర్‌కు చెందిన వారు అనంతపురం-కదిరి రోడ్డు మీదుగా గాని, ప్రసన్నాయపల్లి రైల్వే స్టేషన్ నుంచి నాయక్‌నగర్ మీదుగా గాని రాకపోకలు సాగించవచ్చు.
- భైరవనగర్ 2వ క్రాస్ నుంచి 17వ క్రాస్ వరకు నివాసముంటున్న వారు భైరవనగర్ 9వ రోడ్డు నుంచి ప్రసన్నాయపల్లి రైల్వే స్టేషన్, నాయక్ నగర్ వైపుగా రాకపోకలు సాగించాలి.
- రాప్తాడు, ప్రసన్నాయపల్లి సంబంధిత ప్రాంతాల సాధారణ ప్రజానీకం అనంతపురం- కదిరి రోడ్డు మీదుగా, లేదా ప్రసన్నాయపల్లి రైల్వే స్టేషన్ నుంచి నాయక్ నగర్ మీదుగా రాకపోకలు సాగించవచ్చు.

వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలం..

- రాప్తాడు, అనంతపురం నియోజకవర్గాల్లో పోటీ చేసిన అభ్యర్థులు జేఎన్‌టీయూఏ మొదటి గేట్ నుంచి లోపలకు ప్రవేశించాలి. వారి వాహనాలను జేఎన్‌టీయూఏ గ్రౌండ్ వెనుక వైపు పార్కింగ్ చేయాలి.
- శింగనమల, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో పోటీ చేసిన అభ్యర్థులు రెండో గేట్ (ఆడిటోరియం వద్ద) ద్వారా లోపలకు వెళ్లాలి. వారి వాహనాలను ఆడిటోరియం పక్కన ఉన్న ఖాళీ స్థలంలో పార్కింగ్ చేయాలి.
- తాడిపత్రి, గుంతకల్లు, రాయదుర్గం నియోజకవర్గాల్లో పోటీ చేసిన అభ్యర్థులను మూడో గేట్ (మెయిన్ గేట్) ద్వారా లోపలికి అనుమతిస్తారు. వారి వాహనాలను జేఎన్‌టీయూఏ మెయిన్ బిల్డింగ్ ఎదుట ఉన్న ఖాళీ స్థలంలో పార్కింగ్ చేసుకోవాలి.
- అనంతపురం పార్లమెంట్, రాప్తాడు, అనంతపురం, శింగనమల, కళ్యాణదుర్గం, ఉరవకొండ, తాడిపత్రి, గుంతకల్లు, రాయదుర్గం అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులు, ఏజెంట్ల వాహనాలు జేఎన్‌టీయూఏ ప్రాంగణం దాటిన తర్వాత ఉన్న పాలిటెక్నిక్ కళాశాల గ్రౌండ్‌లో పార్కింగ్ చేసుకోవాలి.

ట్రాక్టర్ బోల్తా.. పలువురికి గాయాలు



బోల్తా పడిన ట్రాక్టర్



చికిత్స పొందుతున్న బాధితురాలు

పెద్దవడుగూరు: మండలంలోని కోటకొండ సమీపంలో ఆదివారం యాడికి మండలం పుప్పాలతండాకు చెందిన నాగునాయక్ ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో 12 మందికి పైగా గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు... నాగునాయక్ తన కుటుంబ సభ్యులతో కలసి పెద్దవడుగూరు మండలం చిట్టూరు గ్రామానికి వెళ్లే మలుపు వద్ద ఉన్న సుంకులమ్మ ఆలయంలో దేవర చేసుకుని తిరుగు ప్రయాణమయ్యాడు. దాదాపు 40 మందికి పైగా కుటుంబసభ్యులు ప్రయాణిస్తున్న ట్రాక్టర్ పెద్దపప్పూరు మండలం సమీపంలోని రెడ్డిపల్లి మలుపు దాటుకుని ముందుకు వెళ్లగానే అదుపు తప్పి బోల్తాపడింది. లక్ష్మమ్మ, లాలెమ్మ, సుప్రజ, రామక్క, అంజలి, వెంకటమ్మ, లక్ష్మక్క, రంగమ్మ, లక్ష్మీదేవి, మనోహర్, అలివేలమ్మ, రాముడు, హర్ష తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108లో తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

బాణాసంచా విక్రేత అరెస్ట్

గుంతకల్లుటౌన్: ప్రభుత్వ లైసెన్స్ పొందకుండా ఇంట్లో అక్రమంగా టపాసులు నిల్వ చేసిన వ్యాపారి వి.ఫణిభూషణ్‌ను ఆదివారం స్థానిక వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. రూ.2.71 లక్షల విలువ చేసే బాణాసంచాను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఈ మేరకు వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య తెలిపారు. గాంధీచౌక్ వద్ద దుకాణం నిర్వహిస్తున్న ఫణిభూషణ్ ఆర్‌టీ స్ట్రీట్‌లోని తన ఇంట్లో ఎలాంటి ప్రభుత్వ లైసెన్సు పొందకుండానే భారీ ఎత్తున బాణాసంచాను నిల్వ ఉంచినట్లు సమాచారం అందడంతో తనిఖీలు చేపట్టి అరెస్ట్ చేశామన్నారు.

12న విత్తనోత్పత్తి దినోత్సవం

బుక్కరాయసముద్రం: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా గుంటూరులో ఈ నెల 12న విత్తన మహోత్సవం నిర్వహించనున్నారు. ఈ మేరకు రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. సదస్సులో విశ్వ విద్యాలయం నుంచి విడుదలైన మేలు రకం విత్తనాల ప్రదర్శన, విక్రయాలు ఉంటాయన్నారు. సదస్సుకు రైతులు పెద్ద ఎత్తున హాజరై, విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.

క్యాంపస్ కళాశాలలో కొత్త కోర్సు

- ఇప్పటి వరకు జేఎన్‌టీయూలో కేవలం ఆరు బ్రాంచ్‌లు మాత్రమే
- తాజాగా కంప్యూటర్ సైన్సెస్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సు ఏర్పాటుకు ఏఐసీటీఈ అనుమతి
- బీటీహెచ్ స్వీడన్ వర్సిటీతో అవగాహన ఒప్పందం
- తొలి మూడేళ్లు జేఎన్‌టీయూఏలో, చివరి సంవత్సరం స్వీడన్‌లో విద్యాభ్యాసం



జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల

అనంతపురం: మారుతున్న కాలానికి అనుగుణంగా, పరిశ్రమల అవసరాలకు దీటుగా మానవ వనరులను అందించే క్రమంలో జేఎన్‌టీయూఏ క్యాంపస్ కళాశాలలో సరికొత్త కోర్సును అమలు చేసేందుకు సన్నాహకాలు సాగుతున్నాయి. 78 సంవత్సరాల ఘన చరిత్ర కలిగిన జేఎన్‌టీయూఏ క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రతిష్టాత్మక బ్రాంచ్‌లతో పాటు నిష్ణాతులైన అధ్యాపకులూ ఉన్నారు. ఈ క్రమంలో బీటెక్‌లో కొత్త కోర్సు అమలుకు ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) అనుమతులు జారీ చేసింది. దీంతో బీటెక్‌లో కంప్యూటర్ సైన్సెస్ విభాగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషీన్ లెర్నింగ్ కోర్సు అమలుకు మార్గం సుగమమైంది. ఇది వరకు జేఎన్‌టీయూఏ క్యాంపస్ కళాశాలలో మెకానికల్, సివిల్, కంప్యూటర్ సైన్సెస్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కెమికల్ కోర్సులు మాత్రమే ఉన్నాయి. తాజాగా కంప్యూటర్ సైన్సెస్ విభాగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషీన్ లెర్నింగ్ కోర్సుతో 7 బ్రాంచ్‌లు కానున్నాయి.

మెరుగైన ఉపాధి అవకాశాలు..

అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి దక్కించుకున్న జేఎన్‌టీయూఏ క్యాంపస్ కళాశాలలో బీటెక్ పూర్తి చేయాలనే ఆకాంక్ష ఎంతో మంది విద్యార్థులకు ఉంది. ఏటా క్యాంపస్ ఇంటర్వ్యూల ద్వారా పేరెన్నిక గల బహుళజాతి సంస్థల్లో 350 మందికి పైగా విద్యార్థులు కొలువులు దక్కించుకుంటున్నారు. దీంతో ఈ కళాశాలలో ఇంజినీరింగ్ అడ్మిషన్లకు భారీగా డిమాండ్ నెలకొంది. అత్యుత్తమ ర్యాంకు సాధించిన విద్యార్థులు తమ తొలి ఆప్షన్‌ను జేఎన్‌టీయూఏ క్యాంపస్ కళాశాలకే ఇస్తుండడం ఇందుకు నిదర్శనం. దీంతో ఏపీఈఏపీసెట్ (గతంలో ఎంసెట్) గణనీయమైన ర్యాంకులు దక్కిన వారికే జేఎన్‌టీయూఏ క్యాంపస్ కళాశాలలో సీటు దక్కుతుంది. ఈ క్రమంలో బీటెక్‌లో అదనంగా ఓ బ్రాంచ్ ఏర్పడితే గొప్ప సదావకాశంగా భావిస్తారు. సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కెమికల్, కంప్యూటర్ సైన్సెస్ విభాగంలో మొత్తం 360 ఇంజినీరింగ్ సీట్లు ఉన్నాయి. తాజాగా కొత్త బ్రాంచ్ ఏర్పడితే మరో 60 ఇంజినీరింగ్ సీట్లు వస్తాయి. ప్రస్తుత మార్కెట్‌లో ఎంతో డిమాండ్ ఉన్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సును జేఎన్‌టీయూఏ క్యాంపస్ కళాశాలలో ప్రవేశపెడితే రాయలసీమ ప్రాంత విద్యార్థులకు గొప్ప అవకాశం దక్కినట్లే.

బీటీహెచ్‌తో సంప్రదింపులు..

స్వీడన్‌లోని బ్లెకింగ్ వర్సిటీ భాగస్వామ్యంతో జేఎన్‌టీయూఏలో ఇంటిగ్రేటెడ్ కోర్సుల అమలవుతున్నాయి. ఈ కోర్సు ద్వారా బీటెక్ బ్రాంచ్‌లో తొలి మూడేళ్లు జేఎన్‌టీయూఏ క్యాంపస్ కళాశాలలో చదవాల్సి ఉంటుంది. చివరి ఏడాది స్వీడన్‌లోని బీటీహెచ్‌లో పూర్తి చేయాల్సి ఉంటుంది. అనంతరం రెండేళ్లు ఎంఎస్ కోర్సును స్వీడన్‌లో అభ్యసించవచ్చు. డిగ్రీని జేఎన్‌టీయూఏ, బీఎస్ పట్టాను బ్లెకింగ్ వర్సిటీ (బీటీహెచ్) స్వీడన్ ప్రదానం చేస్తాయి. కంప్యూటర్ సైన్సెస్, ఎలక్ట్రానిక్స్ ప్రోగ్రామ్‌లో మొత్తం 30 సీట్లు భర్తీ చేయనున్నారు. ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ కోర్సు పూర్తి చేసిన వారు అర్హులు. కనీసం 70 శాతం మార్కులు పొంది ఉండాలి. జేఈఈ మెయిన్స్-2024, ఏపీఈఏపీసెట్-2024, టీఎస్ ఈఏపీసెట్-2024 ర్యాంకు ఆధారంగా అడ్మిషన్లు కల్పిస్తారు. అర్హత సాధించిన విద్యార్థులకు బీటీహెచ్-స్వీడన్ మెరిట్ ఆధారిత ఉపకారవేతనాలు అందుతాయి. ఈ నెల 6న వెబ్‌నార్ నిర్వహించి నోటిఫికేషన్ తేదీలను ఖరారు చేయనున్నారు.

విదేశీ విద్యార్థులకు ఆహ్వానం..

జేఎన్‌టీయూఏకు న్యాక్ -ఏ గ్రేడ్ హోదా దక్కడం, అన్ని విభాగాలకు ఎన్‌బీఏ గుర్తింపుతో పాటు ఎన్ఐఆర్ఎఫ్ (నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్) ర్యాంక్ కలిగి ఉండడంతో విదేశీ విద్యార్థులు సైతం ఇక్కడ చదువుకోవడానికి వీలు కలుగుతోంది. ఈ విషయంగా విదేశీ విద్యార్థులకు ఐసీఎస్ఎస్ఆర్ (ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్) అండగా నిలుస్తోంది. ఆసక్తి గల విద్యార్థులు వర్సిటీకి దరఖాస్తు చేసుకుంటే ఐసీఎస్ఎస్ఆర్ ఉపకారవేతనాలు అందుతాయి. విదేశీ విద్యార్థులు ఇక్కడ చదువుకుంటే పరస్పర ఆలోచనా మార్పిడి, పరిశోధన, అధ్యయనంలో ఒకరి ఆలోచనలు మరొకరు పంచుకోవడం, భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు పెంపొందడంతో పాటు సంస్కృతీసంప్రదాయాలపై మరింత గౌరవ భావం పెరుగుతుంది. ఈ ఉద్దేశ్యంతో విదేశీ విద్యార్థులకు ఉన్నత విద్య అవకాశం కల్పిస్తున్నారు. ఈ క్రమంలో ఇప్పటివరకూ 30 మంది విదేశీ విద్యార్థులు జేఎన్‌టీయూఏలో బీటెక్, ఎంబీఏ కోర్సుల్లో చేరేందుకు ఆసక్తి కనబరుస్తూ దరఖాస్తు చేసుకున్నారు.

పాలక మండలి ఆమోదమే తరువాయి



జేఎన్‌టీయూఏ క్యాంపస్ కళాశాలలో కంప్యూటర్ సైన్సెస్ విభాగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషీన్ లర్నింగ్ కోర్సు ప్రవేశపెట్టడానికి ఏఐసీటీఈ అనుమతులు మంజూరయ్యాయి. పాలకమండలి ఆమోదం పొందిన తర్వాత ఈ కోర్సు అమలు చేస్తాం. సెల్ఫ్ ఫైనాన్స్ కింద భర్తీ చేయాలా? లేక నేరుగా ఏపీఈఏపీ సెట్ ర్యాంక్ ఆధారంగా భర్తీ చేయాలా అనే అంశంపై పాలకమండలి స్పష్టత ఇవ్వనుంది.

– డాక్టర్ జీవీఆర్ శ్రీనివాసరావు, వీసీ, జేఎన్‌టీయూఏ

రిమాండ్‌కు తాడిపత్రి స్వతంత్ర అభ్యర్థి

తాడిపత్రి అర్బన్: హైకోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించిన తాడిపత్రి అసెంబ్లీ నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి, జేసీ ప్రభాకరరెడ్డి ప్రధాన అనుచరుడు పరిమి సోమశేఖరనాయుడిని పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు అర్బన్ సీఐ నాగేంద్రప్రసాద్ ఆదివారం వెల్లడించారు. పోలింగ్ అనంతరం తాడిపత్రిలో చోటు చేసుకున్న అల్లర్లలో సోమశేఖరనాయుడి ప్రమేయం కూడా ఉన్నట్లుగా గుర్తించిన పోలీసులు ఆయనను అరెస్ట్ చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో పోలీసుల కళ్లుగప్పి అజ్ఞాతంలోకి వెళ్లిన ఆయన, అనంతరం అరెస్ట్ నుంచి తప్పించుకునేందుకు హైకోర్టును ఆశ్రయించాడు. దీంతో ఆయనకు షరతులతో కూడిన బెయిల్‌ను హైకోర్టు జారీ చేసింది. ఎలాంటి పరిస్థితుల్లోనూ తాడిపత్రి నియోజకవర్గంలోకి ప్రవేశించకుండా జిల్లా కేంద్రంలోనే ఉండాలని నిబంధన విధించింది. అయితే హైకోర్టు ఉత్తర్వులను ధిక్కరిస్తూ శనివారం పెద్దపప్పూరు మండలం ముచ్చుకోటలో సోమశేఖరనాయుడు పర్యటించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆయనను అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

పెద్దపప్పూరు ఎస్ఐ సస్పెన్షన్

పెద్దపప్పూరు: నియోజకవర్గ బహిష్కరణకు గురైన స్వతంత్ర అభ్యర్థిని అరెస్ట్ చేయడంలో నిర్లక్ష్యం వహించిన పెద్దపప్పూరు ఎస్ఐ శరత్‌చంద్రను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల పోలింగ్ రోజు అనంతరం మరుసటి రోజు జరిగిన రాళ్ల దాడిలో స్వతంత్ర అభ్యర్థి, జేసీ ప్రభాకరరెడ్డి ప్రధాన అనుచరుడు పరిమి సోమశేఖరనాయుడు పాల్గొన్నాడు. దీంతో ఆయనను నియోజకవర్గంలో పర్యటించరాదని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే హైకోర్టు ఆదేశాలు ధిక్కరించి ఆయన పెద్దపప్పూరు మండలం సంచరిస్తున్నట్లు తెలుసుకున్న ఉన్నతాధికారులు వెంటనే అరెస్ట్ చేయాలని ఎస్ఐ శరత్ చంద్రను ఆదేశించారు. అయినా ఆయన నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో సస్పెన్షన్ వేటు వేశారు.

అ‘పూర్వ’ సమ్మేళనం



నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

పెద్దవడుగూరు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో 1986-87లో పదో తరగతి చదువుకున్న వారంతా స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఉన్న ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం కలుసుకున్నారు. దాదాపు 38 సంవత్సరాల తర్వాత కలుసుకున్న వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. నాటి ఉపాధ్యాయులు నాగిరెడ్డి, ఆంజినేయులు, రామప్పను ఘనంగా సన్మానించి, ఆశీర్వాదం తీసుకున్నారు. చిన్ననాటి స్నేహితులను కలుసుకునేందుకు ఇతర రాష్ట్రాల్లో ఉద్యోగాలు చేస్తున్న వారు సైతంతో ఎంతో సంతోషంగా తరలివచ్చారు.


సత్తా చాటిన లాలెప్ప వృషభాలు



వేరుశనగ విత్తు ప్రక్రియను ప్రారంభిస్తున్న రైతు లాలెప్ప

కణేకల్లు: మండలంలోని నాగేపల్లి గ్రామానికి చెందిన లాలెప్ప వృషభాలు 10.30 గంటల సమయంలో 14 ఎకరాల్లో వేరుశనగ విత్తనం వేసి రికార్డు సృష్టించాయి. తక్కువ సమయంలో గరిష్ట విస్తీర్ణంలో వృషభాలు వేరుశనగ విత్తడంతో రైతులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక రైతు అనిల్‌కు చెందిన 6 ఎకరాల పొలంతో పాటు పక్కనే ఉన్న చౌడప్ప, అంజన్నకు చెందిన చెరో మూడెకరాలు కలుపుకుని మొత్తం 14 ఎకరాల్లో ఆదివారం ఉదయం 6 గంటలకు వేరుశనగ విత్తు ప్రారంభించాడు. సాయంకాలం 4.30 గంటలకు విత్తన ప్రక్రియ పూర్తయింది. మండుతున్న ఎండలో గరిష్టస్థాయిలో వేరుశనగ విత్తించాలన్న లాలెప్ప కృషి చివరికి ఫలించింది. లాలెప్పతో పాటు వృషభాలకూ పూలహారాలు వేసి రైతులు ఊరేగించారు.


8 నెలల గర్భిణి మృతి



రాజమ్మ (ఫైల్)

బొమ్మనహాళ్: మండలంలోని గోవిందవాడ గ్రామంలో 8 నెలల గర్భిణి మృతి చెందింది. కుటుంబసభ్యులు తెలిపిన మేరకు... గ్రామానికి చెందిన రాజమ్మ (35)కు విడపనకల్లు మండలం హావళిగి గ్రామానికి చెందిన ఈశప్ప అనే వ్యక్తితో పదేళ్ల క్రితం వివాహమైంది. పదేళ్ల తర్వాత ఆమె తొలిసారి గర్భం దాల్చింది. ప్రస్తుతం ఎనిమిది నెలల గర్భంతో ఉన్న ఆమె దర్గాహొన్నూరు ఆస్పత్రి వైద్యులతో పాటు బెంగళూరులోనూ వైద్య పరీక్షలు చేయించుకుంటోంది. ఈ క్రమంలో ఆదివారం ఇంటి వద్ద పాత్రలు శుభ్రం చేస్తున్న సమయంలో ఆమె ఒక్కసారిగా కుప్పకూలింది. గమనించిన కుటుంబసభ్యులు 108 వాహనంలో బొమ్మనహాళ్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు గుండెపోటు వచ్చినట్లుగా నిర్ధారించారు. దీంతో మెరుగైన వైద్యం కోసం బళ్లారిలోని విమ్స్‌కు తీసుకెళుతుండగా మార్గమధ్యంలో ఆమె మృతి చెందింది. ఈ విషయంపై దర్గాహొన్నూరు వైద్యాధికారిణి రఫీయాసుల్తానాను వివరణ కోరగా ఆమె కొంతకాలంగా గుండె సంబంధిత సమస్యతో బాధపడుతుండేదని, జాగ్రత్తగా ఉండాలని వైద్య పరీక్షల సమయంలో చెప్పే వాళ్లమన్నారు. వైద్య పరీక్షలు సక్రమంగానే అందిస్తున్నామని అన్నారు.

నేడు రుక్మిణీ పాండురంగస్వామి రథోత్సవం



బొమ్మనహాళ్: ఆంధ్ర పండరీపురంగా ప్రసిద్ధి చెందిన ఉంతకల్లు రుక్మిణీ పాండురంగస్వామి రథోత్సవం సోమవారం సాయంత్రం 5 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉదయం రుక్మిణీ పాండురంగస్వామికి క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. అనంతరం పండరీపుర పీఠాధిపతి గోపాల్‌రాజ్ ప్రత్యేక పూజలు నిర్వహించి రథోత్సవాన్ని ప్రారంభిస్తారన్నారు.

క్లుప్తంగా

110 మందికి ఉచిత కంటి ఆపరేషన్లు


వృద్ధుల వివరాలు నమోదు చేస్తున్న వైద్య సిబ్బంది

అనంతపురం కల్చరల్: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఉచిత కంటి వైద్యశిబిరానికి స్పందన లభించిందని నిర్వాహకులు లయన్ అసిపుద్దీన్ అన్నారు. స్థానిక గిల్డ్ ఆఫ్ సర్వీసు పాఠశాల ప్రాంగణం వేదికగా సాగిన శిబిరంలో 200 మందికి పైగా ఉచిత కంటి పరీక్షలు నిర్వహించామన్నారు. మరో 110 మందిని ఉచిత ఆపరేషన్లకు రెఫర్ చేసినట్లు తెలిపారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన వారికి భోజన వసతితో పాటూ దుప్పట్లను పంపిణీ చేశారు. లయన్స్‌క్లబ్ ప్రతినిధులు లక్ష్మీనారాయణ, నబీరసూల్, ఉమామహేశ్వరి పాలగిరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోతలయ్యస్వామికి పూజలు


పూజలందుకుంటున్న పోతలయ్యస్వామి

కనగానపల్లి: మండలంలోని దాదులూరులో పోతలయ్యస్వామికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి పోతలయ్య, చెన్నేకేశవ స్వాములను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు స్వామి వారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

నిరుపేద మహిళలకు సాయం

అనంతపురం కల్చరల్: నిత్యసురభి చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు ఆదివారం నవయుగ కాలనీలో నివసిస్తున్న నిరుపేద మహిళలకు నిత్యావసరాలు అందించారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న వారికి రెండు నెలలకు సరిపడా సరుకులు, బియ్యం బస్తాతో పాటూ కొంత నగదు ఇచ్చామని ఆ ట్రస్టు చైర్‌పర్సన్ డాక్టర్ నిర్మల మురళీ తెలిపారు. దాతలు మరింతగా ముందుకు వచ్చి నిరుపేదలకు సహకారం అందించాలని కోరారు.

నేడు హుండీ కానుకల లెక్కింపు

ఉరవకొండ: పెన్నహోబిలం లక్ష్మీనృసింహస్వామి శాశ్వత హుండీ కానుకలను సోమవారం లెక్కించనున్నట్లు ఈఓ విజయకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. దేవదాయ, ధర్మదాయశాఖ బ్రహ్మోత్సవాల ప్రత్యేక అధికారి సమక్షంలో ఉదయం 9 గంటలకు హుండీ కానుకలు లెక్కించనున్నట్లు తెలిపారు.

గార్లదిన్నెకు చేరుకున్న పాదయాత్ర


జైన మత సిద్ధాంతాలు వివరిస్తున్న దిగంబర స్వామి

గార్లదిన్నె: జైన మత దిగంబర స్వాముల పాదయాత్ర ఆదివారం గార్లదిన్నెకు చేరుకుంది. వివరాలు.. జైన మతానికి చెందిన అంతర్మాన ప్రసన్న సాగర గురువుతో పాటు 17 మంది దిగంబర స్వాములు కర్ణాటకలోని గోమటేశ్వర స్వామి ఆలయం నుంచి హైదరాబాద్‌లోని కుల్‌చారమ్ జైన దేవాలయం వరకూ ఏప్రిల్ 25న పాదయాత్ర కు శ్రీకారం చుట్టారు. శనివారం రాత్రి రాప్తాడులో బస చేసి, ఆదివారం ఉదయం పాదయాత్ర ప్రారంభించి గార్లదిన్నెకు చేరుకున్నారు. రాత్రికి జిల్లా పరిషత్ హైస్కూల్లో బస చేశారు. ఈ సందర్భంగా అక్కడ భక్తులకు స్వాములు జైన మత సిద్ధాంతాలను వివరించారు. ప్రజలు సంతోషంగా ఉండాలని పాదయాత్ర చేస్తున్నట్లు వారు తెలిపారు.

కోటంకలో ప్రత్యేక పూజలు


అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. మహిళలు,భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్న దాన కార్యక్రమం నిర్వహించారు.

జోరుగా పూడికతీత పనులు

- వర్షాల నేపథ్యంలో నగరపాలక సంస్థ ముందస్తు చర్యలు
- మరువవంక, నడిమివంకతో పాటు పెద్ద కాలువల్లో పూడికతీత

నగరపాలక సంస్థలోని
డివిజన్లు : 50
సచివాలయాలు : 74
హౌస్ హోల్డ్స్ : 66,000
కాలువల్లో పూడిక తీయనున్న ప్రాంతాలు: 98


సాయినగర్ సైడ్ కాలువల్లో పూడికతీత పనులు చేపట్టిన కార్మికులు

అనంతపురం కార్పొరేషన్: వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నగరపాలక సంస్థ పాలకవర్గం, అధికారులు అప్రమత్తమయ్యారు. కమిషనర్ మేఘ స్వరూప్ ఆదేశాలతో ఇంజినీరింగ్ అధికారులు, ప్రజారోగ్యాధికారులు, టౌన్ ప్లానింగ్ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. నగరంలోని మరువవంక, నడిమివంకతో పాటు లోతట్టు ప్రాంతాలైన పాతూరు, జనశక్తినగర్, ఎర్రనేలకొట్టాలు, ఖాజానగర్, తదితర ప్రాంతాల్లోని మేజర్ కాలువల్లో పూడికతీత పనులు చేపడుతున్నారు. గతేడాది వచ్చిన అకాల వర్షాలతో నగరంలోని నడిమివంక చుట్టు పక్కల ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న విషయం విదితమే. దీంతో ముందస్తు చర్యల్లో భాగంగా నగరపాలక సంస్థ అధికారులు పూడికతీత పనులకు శ్రీకారం చుట్టారు.

98 ప్రాంతాల్లో ...

మరువవంక, నడిమివంకతో పాటు ఒక మీటర్ పెద్ద కాలువలను ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షణలో జేసీబీ, తదితర వాహనాల సహాయంతో పూడికతీత చేపట్టారు. నగరంలోని 74 సచివాలయాల పరిధిలోని ఆరు సర్కిళ్లలో 98 ప్రాంతాల్లో పూడికతీత పనులు చేపడుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే నడిమివంకకు సంబంధించి 5వ రోడ్డు ప్రాంతంలో పనులు పూర్తిచేశారు. బళ్లారి బైపాస్ ఎంజీఎం ఫ్యాక్టరీ, బళ్లారి సర్వీసు రోడ్డులోని డ్రైన్, కల్వర్టు, బళ్లారి సర్వీసు రోడ్డు నుంచి సోమనాథ్‌నగర్ రామాలయం, హౌసింగ్ బోర్డు భంభం బాబా ఆశ్రమం నుంచి హరిహర దేవాలయం వరకు ఉన్న కాలువ, సాయినగర్ బ్రిడ్జ్, 5వ రోడ్డు భవానీ దేవాలయం సమీపంలో పనులు చేయనున్నారు. అలాగే ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో క్రాంతి హాస్పిటల్ నుంచి రాజహంస వరకు, ఎన్‌టీఆర్ మార్గ్ – భైరవనగర్, సంగమేష్ బ్రిడ్జ్ నుంచి ప్రజా వైద్యశాల, సుభాష్‌రోడ్డులోని లలిత కళా పరిషత్, జీసస్ నగర్‌లోని ట్రిల్లిస్ స్కూల్, తదితర ప్రాంతాల్లో ఉన్న పెద్ద కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా కొన్ని ప్రాంతాల్లో పనులు జరుగుతున్నాయి.


వేణుగోపాల్‌నగర్ సమీపంలో పూడికతీత పనులు ఇలా..

ఆక్రమణల గుర్తింపు

నగరపాలక సంస్థ ఎంహెచ్‌ఓ డాక్టర్ విష్ణుమూర్తి, ఈఈ సూర్యనారాయణ, ఏసీపీ మారుతీహరిప్రసాద్ నగరంలోని వివిధ ప్రాంతాల్లో తరచూ కాలువలు బ్లాక్ అయ్యే పాతూరులోని మున్నానగర్, అంబేద్కర్‌నగర్, జనశక్తి నగర్, తదితర ప్రాంతాల్లో పర్యటించారు. కాలువలపైనే ఇళ్ల నిర్మాణం చేపట్టడంతో పూడికతీత పనులు చేపట్టేందుకు వీలు లేని పరిస్థితి నెలకొన్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్ దృష్టికి తీసుకెళ్లారు. రానున్న రోజుల్లో కాలువలపై చేపట్టిన నిర్మాణాలను తొలగించేందుకు అధికారులు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.

సామాజిక స్పృహ తప్పనిసరి

వర్షాకాలంలో నగర ప్రజలు సైతం చెత్తాచెదారాన్ని ఎక్కడ పడితే అక్కడ వేయకుండా నగరపాలక సంస్థ సిబ్బందికి అందించాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. కాలువలు బ్లాక్ అయితే రివర్స్‌లో మురుగు ఇంటి పరిసరాల్లో ఉండే పరిస్థితి తప్పదంటున్నారు. దీంతో దుర్వాసనతో పాటు అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

పూడికతీత పనులు చేపట్టాం

కమిషనర్ మేఘ స్వరూప్ ఆదేశాలతో టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్, ప్రజారోగ్య విభాగం సమన్వయంతో పూడికతీత పనులు మొదలుపెట్టేలా చర్యలు తీసుకున్నాం. నడిమివంకతో పాటు నగరంలోని వివిధ ప్రాంతాల్లో పూడికతీత పనులు చేస్తున్నాం. త్వరలో అన్ని ప్రాంతాల్లో పూడికతీత పనులు చేపడుతాం.
– సూర్యనారాయణ , ఈఈ, నగరపాలక సంస్థ


నడిమివంకలో పూడికతీత పనులు చేపట్టిన దృశ్యం

కౌంటింగ్ కేంద్రం వద్ద పారిశుధ్య పనులు


జేఎన్‌టీయూ కౌంటింగ్ కేంద్రంలో పారిశుధ్య పనులు చేపడుతున్న కార్మికులు


జేఎన్‌టీయూ ఆవరణలో ఇలా...

అనంతపురం కార్పొరేషన్: కమిషనర్ మేఘ స్వరూప్ ఆదేశాలతో ఎంహెచ్‌ఓ డాక్టర్ విష్ణుమూర్తి పర్యవేక్షణలో ఆదివారం జేఎన్‌టీయూ కౌంటింగ్ కేంద్రం, కేంద్రం ఆవరణంలో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకున్నారు. కౌంటింగ్ కేంద్రాలను శుభ్రం చేశారు. అదేవిధంగా జేఎన్‌టీయూ ఆవరణంలో చెత్తా చెదారం లేకుండా శుభ్రం చేశారు. అనంతరం పిచ్చిమొక్కలు, రాళ్లను తొలగించారు.

కనగానపల్లిలో 54.2 మి.మీ వర్షం


కుర్లపల్లి సమీపంలో నిండిన నీటి కుంట

కనగానపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. కనగానపల్లి, దాదులూరు, మామిళ్లపల్లి, ముక్తాపురం గ్రామాల్లో 54 మి.మీ పైగా వర్షపాతం నమోదనట్లు అధికారులు తెలిపారు. దీంతో పలుచోట్ల వాగులు, వంకలు పారగా, నీటి కుంటలు, చెరువుల్లోకి వర్షపు చేరింది. గాలివాన దెబ్బకు కనగానపల్లి– మామిళ్లపల్లి రహదారి పక్కన పలుచోట్ల చెట్లు నేలకొరిగాయి.


కనగానపల్లి- మామిళ్లపల్లి రహదారి పక్కన నేలకొరిగిన చెట్లు

కార్తికేయునికి విశేష పూజలు


అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు


మంజునాథుడు


పార్వతీ దేవి

ఆత్మకూరు: మండలంలోని పంపనూరులో ఉన్న సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలతో పాటు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం మూల విరాట్‌కు బంగారు ఆబరణాలతో పాటు, పట్టు వస్త్రాలు ధరింప చేసి ఆకుపూజ, విశేష పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో పెద్దఎత్తున కాలసర్పదోష నివారణ రాహుకేతు హోమాలు నిర్వహించారు. అలాగే ఆలయంలోని మంజునాథస్వామి, పార్వతీదేవికి ప్రత్యేక పూజలు అనంతరం మహా మంగళహారతి అందించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

వ్యవసాయ పనుల్లో రైతులు బిజీ


ఆత్మకూరు వద్ద వర్షం రాకతో పొలాన్ని ట్రాక్టర్‌తో దున్నుతున్న రైతు


ట్రాక్టర్‌తో ఎరువును పొలాల్లోకి తరలిస్తున్న దృశ్యం


విత్తనం కోసం సబ్సిడీ వేరుశనగ తీసుకెళ్తున్న రైతులు

ఆత్మకూరు: మూడు వారాల నుంచి వర్షాలు సమృద్ధిగా కురుస్తుండడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో అన్నదాతలు పొలాలను దుక్కి చేయడంతోపాటు విత్తనాలు విత్తడానికి చదును చేస్తున్నారు. మరికొంత మంది రైతులు పొలాల్లోకి ఎరువులను వేసే పనుల్లో నిమగ్నమయ్యారు. వర్షాలు కురుస్తుండుటంతో వేరుశనగ విత్తనం సాగు చేసేందుకు చాలామంది సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం సబ్సిడీతో వేరుశనగ విత్తనాలను రైతులకు అందిస్తోంది. గతంలో 15 వేల హెక్టార్లకు పైగా వేరుశనగ రైతులు సాగు చేసేవారు. గత ఏడాది సకాలంలో వర్షాలు లేకపోవడంతో విత్తన సాగు బాగా తగ్గింది. ప్రస్తుతం సకాలంలో వర్షాలు కురుస్తున్నందున విత్తన సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు.

భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం


ప్రత్యేక అలంకరణలో ముత్యాలమ్మ


సుదర్శన హోమం నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: లోక కల్యాణార్థం నగరంలోని హెచ్చెల్సీకాలనీ షసనకోట ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం జరిగింది. హనుమజ్జయంతి మరుసటిరోజు ఆనవాయితీ సాగే హోమాన్ని వేదపండితులు గిరిస్వామి శాస్త్రోక్తంగా నిర్వహించారు. అదేవిధంగా ఆలయ ధర్మకర్త, కార్పొరేటర్ గురుశేఖరబాబు నేతృత్వంలో వినాయకునికి, నవగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం పూర్ణాహుతి కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ సమాజం సుభిక్షంగా ఉండేవిధంగా హోమాలు జరపడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా విశేష అలంకరణలో ఉన్న ముత్యాలమ్మను భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి కుటుంబ సభ్యులు మాలతి, సువర్ణ, మాజీ కార్పొరేటర్ బిందుప్రియ తదితరులు పాల్గొన్నారు.

టీసీ హైస్కూల్‌కు నూతన శోభ


'నాడు- నేడు' పనుల ద్వారా రూపుదిద్దుకున్న పామిడి టీసీ హైస్కూల్

పామిడి: పట్టణంలోని టీసీ హైస్కూల్ రూపురేఖలు మారాయి. నాడు–నేడు కార్యక్రమం కింద పాఠశాల సర్వాంగసుందరంగా తయారైంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగానికి పెద్దపీట వేస్తూ పాఠశాలలను మెరుగుపర్చేందుకు ప్రవేశ పెట్టిన 'నాడు–నేడు'తో టీసీ హైస్కూల్ కొత్త శోభ సంతరించుకుంది. గతంలో శిథిలమైన తరగతి గదులు, తాగునీరు, డెస్క్‌లు, మరుగుదొడ్లు వంటి కనీస వసతులు కరువై స్కూల్ సమస్యల వలయంలో కొట్టుమిట్టాడేది. ప్రస్తుతం అన్నిహంగులతో కూడిన మౌలిక వసతుల కల్పనతో స్కూల్ కొత్త కళకు నోచుకుంది. 1949లో ఏపీ మద్రాసు ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న సమయంలో ఈ పాఠశాల హైయ్యర్ సెకెండరీ స్కూల్ (ఎస్ఎస్ఎల్‌సీ)గా ప్రారంభమైంది. కాలక్రమేణా ఈ స్కూల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలగా ఏర్పడింది. 1998లో హైస్కూల్, జూనియర్ కళాశాలగా విడిపోయింది. 1999లో స్కూల్ స్థలదాత పేర టంగుటూరి చిన్నప్ప శ్రేష్టి (టీసీ) హైస్కూల్ అయ్యింది. ఈ స్కూల్‌లో విద్యనభ్యసించిన ఎంతో మంది ప్రభుత్వ ఉన్నత పదవుల్లో కొలువుదీరారు. నాడు–నేడు పథకం కింద రూ.76.40 లక్షలతో రంగులతో కొత్తమెరుగును సంతరించుకున్న ఈ హైస్కూల్ కార్పొరేట్ పాఠశాలను తలపిస్తోంది.

మోడల్ స్కూల్లో మిగులు సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

గార్లదిన్నె: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్లో 7, 8, 9వ తరగతిలో మిగిలిన సీట్ల భర్తీ కోసం అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సతీష్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 15 లోపు విద్యార్థులు పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 19వ తేదీ పాఠశాలలో విద్యార్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ప్రవేశ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా సీట్లు కేటాయిస్తామన్నారు. మండల విద్యార్థులు సద్వినియోగం చేసుకో వాలన్నారు.

ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

బుక్కరాయసముద్రం: మండల కేంద్రలోని జెడ్పీ హైస్కూల్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రధానోపాధ్యాయురాలు వసుంధర సూచించారు. ఈ ఏడాది నుంచి బీకేఎస్ హైస్కూల్‌లో బాల, బాలికలకు ఇంటర్ మీడియట్ ప్రారంభిస్తున్నామన్నారు. ఎంపీసీ 40 సీట్లు, సీఈసీ 40 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. మండలంలోని పదోతరగతి విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఇంటర్ మొదటి సంవత్సర ప్రవేశానికి దరఖాస్తుచేసుకోవాలన్నారు. వివరాలకు బీకేఎస్ జెడ్పీ హైస్కూల్‌లో సంప్రదించాలన్నారు.

దశభుజ మహా గణపతికి పూజలు


పూజలందుకున్న దశభుజ మహా గణపతి

రాయదుర్గం టౌన్: పట్టణంలోని ఆత్మకూరు వీధిలో వెలసిన దశభుజ మహా గణపతికి ఆదివారం విశేష పూజలు జరిగాయి. ప్రతి ఆదివారం స్వామికి అభిషేకం, పూజలు నిర్వహిస్తారు. స్వామి దర్శనం కోసం స్థానిక భక్తులే కాక కర్ణాటక నుంచి కూడా అధిక సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

వ్యక్తి మృతి


వీరారెడ్డి (ఫైల్)

బుక్కరాయసముద్రం: మండలంలోని చెన్నంపల్లిలో ఆత్మహత్యకు యత్నించిన వీరారెడ్డి (28) చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల వివరాలు.. చెన్నంపల్లి గ్రామానికి చెందిన ఈశ్వరరెడ్డి కుమారుడు వీరారెడ్డి బెంగళూరులోఓ హార్డ్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. గ్రామంలో పంటల సాగుకు, కుటుంబ పోషణ కోసం రూ.8 లక్షల వరకూ అప్పులు చేశాడు. అప్పు తీరే మార్గం కానరాక మానసిక వేదనతో మూడు రోజుల క్రితం పురుగుల మందు తాగాడు. కుటుంబీలకు వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం అక్కడి వైద్యుల సూచన మేరకు కర్నూలు ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతునికి భార్య, కూతురు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బైబిల్ పాఠశాలను సద్వినియోగం చేసుకోండి

పామిడి: పట్టణంలోని సీఎస్ఐ చర్చిలో 6, 7, 8, 9 తేదీల్లో నిర్వహించే విరామ బైబిల్ పాఠశాలను క్రైస్తవ, క్రైస్తవేతర విశ్వాసుల పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని పాస్టర్ రెవరెండ్ బీవీ విశ్వమోహన్ సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ చిన్ననాటి నుంచే పిల్లలను సన్మార్గంలో పయనింప జేయడానికి విరామ బైబిల్ స్కూల్ తోడ్పడుతుందన్నారు. మండల వ్యాప్తంగా ఒకటి నుంచి పదో తరగతి చదువుతున్న పిల్లలు అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

బొలెరో వాహనం బోల్తా

గార్లదిన్నె: మండల కేంద్రం సమీపంలోని లోలూరు క్రాస్ 44వ జాతీయ రహదారిపై ఆదివారం టమాట తరలిస్తున్న బొలెరో వాహనం బోల్తా పడింది. స్థానికుల వివరాల మేరకు.. మదనపల్లి నుంచి బొలెరో వాహనం టమాట లోడ్‌తో హైదరాబాద్ బయలేదేరింది. లోలూరు క్రాస్ వద్దకు రాగానే వెనుక టైర్ పంచర్ కావడంతో వాహనం బోల్తా పడింది. ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. వెంటనే మరో వాహనంలో టమాటాలు లోడ్ చేసి హైదరాబాద్‌కు తరలించారు.